ప్రభాత గమనం
తెలుగు దినపత్రిక
తెలుగు దినపత్రికలో పనిచేయడానికి ఆసక్తి కలవారికి ఆహ్వానము.
వివరాలకు సంప్రదించండి : 7780470374
మహబూబాబాద్ జిల్లాలో ఖాళీలు :

| | | | |
|---|---|---|---|
| కొత్తగూడ | గార్ల / కురవి | దంతాలపల్లి | పెద్దవంగర |
| గంగారం | బయ్యారం | చిన్నగూడూరు | నెల్లికుదురు |
| కేసముద్రం | మరిపెడ | నర్సింహులపేట | ఇనుగుర్తి |


TELTEL/2022/83842

PRABHATA GAMANAM
# ప్రభాత గమనం
తెలుగు దినపత్రిక

గురువారం 12, మార్చి 2026 | వరంగల్ | సంపుటి :04 | సంచిక :179 | పేజీలు :4 | వెల. 3/-



## గవర్నర్ గా 'శుక్లా' ప్రమాణం

- లోక్ భవన్ వేదికగా వేడుక
- హాజరైన సీఎం రేవంత్, మంత్రులు

**ప్రభాత గమనం, హైదరాబాద్ :**

తెలంగాణ నూతన గవర్నర్‌గా శివ్ ప్రతాప్ శుక్లా బుధవారం రాజ్‌భవన్ (లోక్‌భవన్)లో అట్టహాసంగా ప్రమాణ స్వీకారం చేశారు. హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి ఆయనతో పదవీ ప్రమాణస్వీకారం చేయించారు. నూతన గవర్నర్ అనర్గళంగా తెలుగులో ప్రమాణస్వీకారం చేయడం అందరినీ ఆకట్టుకుంది.

— వివరాలు 2వ పేజీలో..




## 108 మంది మావోల లొంగుబాటు

- వీరిలో 44 మంది మహిళలు
- భారీగా నగదు, ఆయుధ సామాగ్రి లభ్యం

**ప్రభాత గమనం, రాయ్‌పూర్**

ఛత్తీస్‌గఢ్‌లోని జగదల్‌పూర్‌లో బుధవారం 108 మంది మావోయిస్టులు పోలీసుల ఎదుట లొంగిపోయారు. వీరందరూ తమ ఆయుధాలను అధికారులకు అప్పగించి జనజీవన స్రవంతిలో కలిశారు. జగదల్ పూర్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. లొంగిపోయిన వారిపై ప్రభుత్వం గతంలో మొత్తం రూ.3.29 కోట్ల భారీ రివార్డును ప్రకటించింది. లొంగిపోయినవారిలో 44 మంది మహిళా మావోయిస్టులు ఉన్నారు. పోలీసులు వీరి నుంచి భారీగా ఆయుధాలను, నగదును స్వాధీనం చేసుకున్నారు. లొంగిపోయిన వారి వద్ద నుంచి 101 ఆయుధాలు లభ్యమయ్యాయి. వీటితో పాటు పోలీసులు ఒక భారీ డంపును కూడా కనుగొన్నారు.

— వివరాలు 2వ పేజీలో..



2

## పంచాయతీ నిధులు గోల్‌మాల్

- వార్డు సభ్యులకు సమాచారం లేకుండానే రూ.10లక్షల నగదు విత్ డ్రా
- సర్పంచ్, కార్యదర్శి వైఖరిపై సోషల్ మీడియాలో చర్చ
- కేసముద్రం మండలంలోని మేజర్ గ్రామ పంచాయతీలో వివాదం
- సమగ్ర విచారణ చేయాలని గ్రామస్తుల డిమాండ్

మహబూబాబాద్ జిల్లా కేసముద్రం మండలంలోని ఓ మేజర్ గ్రామ పంచాయతీలో రూ.10 లక్షల పంచాయతీ నిధుల విత్ డ్రా వ్యవహారం వివాదాస్పదంగా మారింది. గ్రామ సర్పంచ్, పంచాయతీ కార్యదర్శి కలిసి వార్డు సభ్యులకు సమాచారం ఇవ్వకుండా భారీ మొత్తంలో నగదు తీసుకున్నారన్న ఆరోపణలు గ్రామంలో చర్చనీయాంశంగా మారాయి. ఇటీవల కేంద్ర ప్రభుత్వం విడుదల చేసిన 15వ ఆర్థిక సంఘం నిధుల్లో భాగంగా ఈ గ్రామ పంచాయతీకి కూడా గ్రాంట్ నిధులు వచ్చినట్లు సమాచారం. సాధారణంగా ఈ నిధులను గ్రామ అభివృద్ధి, మౌలిక సదుపాయాలు, పారిశుద్ధ్య పనుల కోసం వినియోగించాల్సి ఉంటుంది. ఇందుకోసం పంచాయతీ పాలకవర్గం సమావేశం నిర్వహించి తీర్మానం చేసి పనులు చేపట్టాలి. అయితే అలాంటి ప్రక్రియలు పాటించకుండా సర్పంచ్, కార్యదర్శి కలిసి అక్షరాల రూ.10 లక్షల నగదును విత్ డ్రా చేసినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి.

— ప్రభాత గమనం, వరంగల్ బ్యూరో

## రాష్ట్రంలో మూడో డిస్కం

- 'తెలంగాణ రైతు పవర్ డిస్ట్రిబ్యూషన్ కంపెనీ లిమిటెడ్'గా నామకరణం
- సీఎండీగా ఐఏఎస్ అధికారి ముషారఫ్ అలీ ఫరూఖీ నియామకం
- రైతులకు నాణ్యమైన విద్యుత్ సరఫరా లక్ష్యం

తెలంగాణ విద్యుత్ రంగంలో రాష్ట్ర ప్రభుత్వం మరో కీలక నిర్ణయం తీసుకుంది. ఇప్పటికే పనిచేస్తున్న టీఎస్ఎస్పీడీసీఎల్, టీఎస్ఎన్‌పీడీసీఎల్ సంస్థలకు అదనంగా రాష్ట్రంలో మూడో విద్యుత్ పంపిణీ సంస్థను ఏర్పాటు చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. కొత్త సంస్థకు 'తెలంగాణ రైతు పవర్ డిస్ట్రిబ్యూషన్ కంపెనీ లిమిటెడ్' (TGRPDCL) అని పేరు పెట్టింది. ఈ సంస్థకు సీనియర్ ఐఏఎస్ అధికారి ముషారఫ్ అలీ ఫరూఖీని చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ (సీఎండీ)గా ప్రభుత్వం నియమించింది. ఆయనతో పాటు సంస్థ కార్యకలాపాలను పర్యవేక్షించేందుకు నలుగురు డైరెక్టర్లను కూడా నియమించారు. ఈ కొత్త డిస్కమ్ ప్రధానంగా వ్యవసాయ విద్యుత్ కనెక్షన్ల నిర్వహణ, రైతులకు నాణ్యమైన విద్యుత్ సరఫరా, కొత్త కనెక్షన్ల మంజూరు వంటి బాధ్యతలను నిర్వహించనుంది.

— ప్రభాత గమనం, హైదరాబాద్



2

ప్రభాత గమనం
తెలుగు దినపత్రిక

# పంచాయతీ నిధులు గోల్‌మాల్

- వార్డు సభ్యులకు సమాచారం లేకుండానే రూ.10లక్షల నగదు విత్ డ్రా
- సర్పంచ్, కార్యదర్శి వైఖరిపై సోషల్ మీడియాలో చర్చ
- కేసముద్రం మండలంలోని మేజర్ గ్రామ పంచాయతీలో వివాదం
- సమగ్ర విచారణ చేయాలని గ్రామస్థుల డిమాండ్




**ప్రభాత గమనం, వరంగల్ బ్యూరో :**

మహబూబాబాద్ జిల్లా కేసముద్రం మండలంలోని ఓ మేజర్ గ్రామ పంచాయతీలో రూ.10 లక్షల పంచాయతీ నిధుల విత్‌డ్రా వ్యవహారం వివాదాస్పదంగా మారింది. గ్రామ సర్పంచ్, పంచాయతీ కార్యదర్శి కలిసి వార్డు సభ్యులకు సమాచారం ఇవ్వకుండా భారీ మొత్తంలో నగదు తీసుకున్నారన్న ఆరోపణలు గ్రామంలో చర్చనీయాంశంగా మారాయి. ఇటీవల కేంద్ర ప్రభుత్వం విడుదల చేసిన 15వ ఆర్థిక సంఘం నిధుల్లో భాగంగా ఈ గ్రామ పంచాయతీకి కూడా గ్రాంట్ నిధులు వచ్చినట్లు సమాచారం. సాధారణంగా ఈ నిధులను గ్రామ అభివృద్ధి, మౌలిక సదుపాయాలు, పారిశుద్ధ్య పనుల కోసం వినియోగించాల్సి ఉంటుంది. ఇందుకోసం పంచాయతీ పాలకవర్గం సమావేశం నిర్వహించి తీర్మానం చేసి పనులు చేపట్టాలి. అయితే అలాంటి ప్రక్రియలు పాటించకుండా సర్పంచ్, కార్యదర్శి కలిసి అక్షరాల రూ.10 లక్షల నగదును విత్‌డ్రా చేసినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. వార్డు సభ్యులకు సమాచారం లేకుండా విత్‌డ్రా ఈ నగదు విత్‌డ్రా గురించి వార్డు సభ్యులకు ఎలాంటి సమాచారం ఇవ్వలేదని గ్రామస్థులు చెబుతున్నారు. విషయం తెలిసిన తర్వాత వార్డు సభ్యులు ప్రశ్నించగా "మాకు నగదు తీసుకునే అధికారం ఉంది" అంటూ సర్పంచ్ సమాధానం ఇచ్చినట్లు గ్రామ వాట్సాప్ గ్రూపుల్లో ప్రచారం జరుగుతోంది. దీంతో గ్రామ ప్రజలు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

### సోషల్ మీడియాలో జోరుగా చర్చ

ఈ వ్యవహారం సోషల్ మీడియాలో కూడా పెద్ద ఎత్తున చర్చకు దారితీసింది. గ్రామ యువకులు, ప్రజలు పంచాయతీ నిధుల వినియోగంపై ప్రశ్నలు లేవనెత్తుతూ పోస్టులు పెడుతున్నారు. గ్రామ అభివృద్ధి కోసం వచ్చిన నిధులను పారదర్శకంగా వినియోగించాలనే డిమాండ్ వ్యక్తమవుతోంది.

### నిబంధనలు పాటించలేదని ఆరోపణలు

పంచాయతీ రాజ్ చట్టం ప్రకారం నగదు విత్‌డ్రా చేసినప్పుడు సంబంధిత అధికారులు సమక్షంలో తీసుకోవాలి. ఆ నగదును వెంటనే పంచాయతీ ఖాతాలో నమోదు చేసి వినియోగ వివరాలను రికార్డుల్లో నమోదు చేయాలి. అయితే ఈ నిబంధనలు పాటించలేదని గ్రామస్థులు ఆరోపిస్తున్నారు.

### విచారణ చేపట్టాలని డిమాండ్

ఇటీవలే ఎన్నికైన సర్పంచ్‌పై ఇలాంటి ఆరోపణలు రావడం పట్ల గ్రామ ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. గ్రామ అభివృద్ధి కోసం ఓటు వేసి గెలిపిస్తే నిధుల వినియోగంపై వివాదాలు రావడం బాధాకరమని అంటున్నారు. ఈ వ్యవహారంపై జిల్లా కలెక్టర్, కేసముద్రం ఎంపీడీవో స్పందించి సమగ్ర విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు కోరుతున్నారు.



# రాష్ట్రంలో మూడో డిస్కం

- 'తెలంగాణ రైతు పవర్ డిస్ట్రిబ్యూషన్ కంపెనీ లిమిటెడ్'గా నామకరణం
- సీఎండీగా ఐఏఎస్ అధికారి ముషారఫ్ అలీ ఫరూఖీ నియామకం
- రైతులకు నాణ్యమైన విద్యుత్ సరఫరా లక్ష్యం

**ప్రభాత గమనం, హైదరాబాద్:**

తెలంగాణ విద్యుత్ రంగంలో రాష్ట్ర ప్రభుత్వం మరో కీలక నిర్ణయం తీసుకుంది. ఇప్పటికే పనిచేస్తున్న టీఎస్ఎస్పీడీసీఎల్, టీఎస్ఎన్పీడీసీఎల్ సంస్థలకు అదనంగా రాష్ట్రంలో మూడో విద్యుత్ పంపిణీ సంస్థను ఏర్పాటు చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. కొత్త సంస్థకు 'తెలంగాణ రైతు పవర్ డిస్ట్రిబ్యూషన్ కంపెనీ లిమిటెడ్' (TGRPDCL) అని పేరు పెట్టింది. ఈ సంస్థకు సీనియర్ ఐఏఎస్ అధికారి ముషారఫ్ అలీ ఫరూఖీని చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ (సీఎండీ)గా ప్రభుత్వం నియమించింది. ఆయనతో పాటు సంస్థ కార్యకలాపాలను పర్యవేక్షించేందుకు నలుగురు డైరెక్టర్లను కూడా నియమించారు. ఈ కొత్త డిస్కమ్ ప్రధానంగా వ్యవసాయ విద్యుత్ కనెక్షన్ల నిర్వహణ, రైతులకు నాణ్యమైన విద్యుత్ సరఫరా, కొత్త కనెక్షన్ల మంజూరు వంటి బాధ్యతలను నిర్వహించనుంది. అలాగే భారీ, మధ్యతరహా ఎత్తిపోతల పథకాలకు అవసరమైన విద్యుత్ సరఫరా పర్యవేక్షణ కూడా ఈ సంస్థ పరిధిలోకి వస్తుంది. మిషన్ భగీరథ, హైదరాబాద్ మెట్రో వాటర్ వర్క్స్, మున్సిపల్ వాటర్ సప్లై స్కీమ్‌లకు సంబంధించిన విద్యుత్ కనెక్షన్ల బాధ్యతలను కూడా ఈ డిస్కమ్‌కు అప్పగించారు. వ్యవసాయం, ప్రభుత్వ ప్రాజెక్టుల విద్యుత్ లోడును వేరు చేయడం ద్వారా పంపిణీ వ్యవస్థ మరింత మెరుగుపడుతుందని ప్రభుత్వం భావిస్తోంది. రాష్ట్ర విభజన తర్వాత తెలంగాణ విద్యుత్ రంగంలో చేపట్టిన ముఖ్యమైన సంస్కరణగా ఈ నిర్ణయాన్ని అధికారులు పేర్కొంటున్నారు. రైతులకు నిరంతరాయంగా నాణ్యమైన విద్యుత్ అందించడం ఈ కొత్త డిస్కమ్ ప్రధాన లక్ష్యంగా ఉండనుంది.

# 108 మంది మావోల లొంగుబాటు

- వీరిలో 44 మంది మహిళలు
- భారీగా నగదు, ఆయుధ సామాగ్రి లభ్యం

ప్రభాత గమనం, రాయ్‌పూర్ : ఛత్తీస్‌గఢ్‌లోని జగదల్‌పూర్‌లో బుధవారం 108 మంది మావోయిస్టులు పోలీసుల ఎదుట లొంగిపోయారు. వీరందరూ తమ ఆయుధాలను అధికారులకు అప్పగించి జనజీవన స్రవంతిలో కలిశారు. జగదల్ పూర్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. లొంగిపోయిన వారిపై ప్రభుత్వం గతంలో మొత్తం రూ.3.29 కోట్ల భారీ రివార్డును ప్రకటించింది. లొంగిపోయినవారిలో 44 మంది మహిళా మావోయిస్టులు ఉన్నారు. పోలీసులు వీరి నుంచి భారీగా ఆయుధాలను, నగదును స్వాధీనం చేసుకున్నారు. లొంగిపోయిన వారి వద్ద నుంచి 101 ఆయుధాలు లభ్యమయ్యాయి. వీటితో పాటు పోలీసులు ఒక భారీ డంపును కూడా కనుగొన్నారు. ఆ డంపులో రూ.3.61 కోట్ల నగదు లభించింది. సుమారు రూ.1.64 కోట్ల విలువ చేసే ఒక కిలో బంగారాన్ని కూడా పోలీసులు స్వాధీనం చేసుకున్నట్లు వెల్లడించారు. ఛత్తీస్‌గఢ్ పోలీసుల చరిత్రలో ఇది ఒక అతిపెద్ద విజయంగా అధికారులు భావిస్తున్నారు. మావోయిస్టుల పునరావాస పథకం రాష్ట్రంలో అత్యంత ప్రభావవంతంగా అమలు అవుతోంది. దీని ఫలితంగానే గత 26 నెలల్లో ఛత్తీస్‌గఢ్ వ్యాప్తంగా మొత్తం 2,714 మంది మావోయిస్టులు ఆయుధాలు వీడి సాధారణ జీవితంలోకి వచ్చారు.







# గవర్నర్ గా 'శుక్లా' ప్రమాణం

- లోక్ భవన్ వేదికగా వేడుక
- హాజరైన సీఎం రేవంత్, మంత్రులు

**ప్రభాత గమనం, హైదరాబాద్ :**

తెలంగాణ నూతన గవర్నర్‌గా శివ్ ప్రతాప్ శుక్లా బుధవారం రాజ్‌భవన్ (లోక్‌భవన్)లో అట్టహాసంగా ప్రమాణ స్వీకారం చేశారు. హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి ఆయనతో పదవీ ప్రమాణస్వీకారం చేయించారు. నూతన గవర్నర్ అనర్గళంగా తెలుగులో ప్రమాణస్వీకారం చేయడం అందరినీ ఆకట్టుకుంది. ఈ వేడుకకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, శాసనమండలి చైర్మన్, రాష్ట్ర మంత్రులు, ఎమ్మెల్యేలు, పలువురు ఉన్నతాధికారులు హాజరై ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు. బాధ్యతలు చేపట్టిన అనంతరం గవర్నర్ శివ్ ప్రతాప్ శుక్లా రాష్ట్ర ప్రజలనుద్దేశించి కీలక సందేశం ఇచ్చారు. తెలంగాణ ప్రజలకు సేవ చేసే అవకాశం రావడం తన అదృష్టమని ఆయన పేర్కొన్నారు. తనపై నమ్మకం ఉంచిన రాష్ట్రపతికి, ప్రధానమంత్రికి ఈ సందర్భంగా ఆయన ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. తెలంగాణ రాష్ట్రం గొప్ప సాంస్కృతిక సంపదకు, విశిష్ట సంప్రదాయాలకు నెలవని కొనియాడారు. హిమాచల్ ప్రదేశ్ గవర్నర్‌గా తనకు ఉన్న అనుభవం తెలంగాణ అభివృద్ధికి ఎంతగానో ఉపయోగపడుతుందని ఆయన ధీమా వ్యక్తం చేశారు. తెలంగాణ సమాజం ఆశలకు, సరికొత్త ఆవిష్కరణలకు చిరునామా అని గవర్నర్ ప్రశంసించారు. ప్రజల దీక్ష, పట్టుదల వల్ల రాష్ట్రం అన్ని రంగాల్లో సమగ్ర అభివృద్ధి దిశగా దూసుకుపోతోందని ఆయన అభిప్రాయపడ్డారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి, ఆయన మంత్రివర్గ సహచరులకు శుభాకాంక్షలు తెలుపుతూ రాజ్యాంగబద్ధంగా, నిజాయితీగా తన విధులను నిర్వహిస్తానని స్పష్టం చేశారు. ప్రజాస్వామ్య విలువలను కాపాడుతూ సుసంపన్నమైన తెలంగాణ నిర్మాణం కోసం ప్రభుత్వంతో కలిసి పని చేస్తానని గవర్నర్ తన సందేశంలో ఉద్ఘాటించారు.

# ఉద్యాన పంటలతో రైతులకు అధిక ఆదాయం


ప్రభాతగమనం, మహబూబాబాద్: మార్కెట్‌లో డిమాండ్ ఉన్న ఉద్యాన పంటలను సాగు చేస్తే రైతులు మంచి ఆదాయం పొందవచ్చని జిల్లా ఉద్యాన శాఖ అధికారి జినుగు మరియన్న తెలిపారు. బుధవారం దంతాలపల్లి, నర్సింహులపేట, పెదద వంగర, తొర్రూరు, నెల్లికుదురు, ఇనుగుర్తి మండలాల్లో పర్యటించి ఆయిల్ పామ్ సాగుపై రైతులకు అవగాహన కల్పించారు. ఆయిల్ పామ్ సాగుకు ఎకరానికి రూ.50,918 వరకు, డ్రాగన్ ఫ్రూట్‌కు రూ.64,800, మామిడి, నిమ్మ, జామ తోటలకు రూ.19,200 చొప్పున ప్రభుత్వం రాయితీలు అందిస్తుందని తెలిపారు. రైతులు పందిరి కూరగాయలు, పూలు, పండ్లు, మల్బరీ సాగుపై దృష్టి సారించాలని సూచించారు.



# క్షమాపణ చెప్పే ధైర్యం కేసీఆర్‌కు ఉందా?

**–ఎమ్మెల్యే కడియం శ్రీహరి**

ప్రభాత గమనం, వరంగల్ బ్యూరో/స్టేషన్ ఘన్‌పూర్, మార్చి 11: తెలంగాణలో రాజకీయ వ్యవస్థను భ్రష్టుపట్టించినందుకు మాజీ ముఖ్యమంత్రి కే. చంద్రశేఖర్ రావు ప్రజలకు క్షమాపణ చెప్పాలని, అలా చేస్తే తాను వెంటనే ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేసి ప్రజాక్షేత్రంలోకి వెళ్తానని స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి సవాల్ విసిరారు. బుధవారం విడుదల చేసిన ప్రకటనలో ఆయన మాట్లాడుతూ పార్టీ ఫిరాయింపుల అసలు సూత్రధారి కేసీఆర్‌నే అని ఆరోపించారు. 2014 నుంచి 2023 వరకు ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో ఇతర పార్టీలకు చెందిన పలువురు ఎమ్మెల్యేలను బీఆర్ఎస్ పార్టీలో చేర్చుకున్నారని విమర్శించారు. పార్టీ మారిన వారిలో ఇద్దరికి మంత్రిపదవులు కూడా ఇచ్చిన చరిత్ర ఉందని పేర్కొన్నారు. తెలంగాణలో ఇతర రాజకీయ పార్టీలు ఉండకూడదనే ఉద్దేశంతో శాసనసభాపక్షాలను కూడా విలీనం చేసుకున్నారని అన్నారు. కేసీఆర్‌తో పాటు కే.టి. రామారావు నైతిక విలువలపై మాట్లాడే అర్హత లేదని విమర్శించారు. నైతిక విలువలు కేవలం తనకేనా, కేసీఆర్‌కు వర్తించవా అని ప్రశ్నించారు. తెలంగాణ ప్రజలకు క్షమాపణ చెప్పే ధైర్యం కేసీఆర్‌కు ఉందా అని సవాల్ చేశారు.



**స్పీకర్ తీర్పును స్వాగతిస్తాం..**

పార్టీ ఫిరాయింపులపై దాఖలైన ఎమ్మెల్యేల అనర్హత పిటిషన్లను డిస్మిస్ చేస్తూ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ ఇచ్చిన తీర్పును తాను స్వాగతిస్తున్నట్లు కడియం శ్రీహరి తెలిపారు. బీఆర్ఎస్ పార్టీ నియమావళి ప్రకారం ముందుగా షోకాజ్ నోటీసు ఇచ్చి వివరణ తీసుకోవాల్సి ఉండగా తనకు అలాంటి నోటీసు ఇవ్వలేదన్నారు. తాను ఎప్పుడూ పార్టీ విప్‌ను ధిక్కరించలేదని స్పష్టం చేశారు. అసలు అనర్హత పిటిషన్‌కే చట్టబద్ధత లేదని పేర్కొంటూ, పార్టీ తరఫున కేసీఆర్ స్వయంగా పిటిషన్ ఎందుకు వేయలేదని ప్రశ్నించారు. శాసన సభలో బీఆర్ఎస్ సభ్యుల సంఖ్య 38 అని చెప్పిన కేటీఆర్ మరోవైపు అనర్హత పిటిషన్లు వేయడం విరుద్ధమని విమర్శించారు. అలాగే బీఆర్ఎస్ ఎల్పీకి తమ జీతం నుంచి సభ్యత్వ రుసుము తీసుకుంటూనే తమపై అనర్హత పిటిషన్లు వేయడం ఆశ్చర్యకరమని కడియం శ్రీహరి వ్యాఖ్యానించారు.

## క్రీడా పాఠశాలలో ప్రవేశానికి ఎంపిక పోటీలు

ప్రభాత గమనం, కేసముద్రం, మార్చి 11: కేసముద్రం స్టేషన్ హైస్కూల్లో ఈ నెల 13న క్రీడా పాఠశాలలో ప్రవేశాలకు ఎంపిక పోటీలు నిర్వహించనున్నట్లు మండల విద్యాశాఖాధికారి కాలేరు యాదగిరి తెలిపారు. 2026–27 విద్యా సంవత్సరానికి హకీంపేట, కరీంనగర్, ఆదిలాబాద్, హనుమకొండలోని క్రీడా పాఠశాలల్లో నాలుగో తరగతిలో ప్రవేశాల కోసం విద్యార్థులు ఈ నెల 12లోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఇందుకోసం tgss.telangana.gov.in వెబ్‌సైట్‌లో పేర్లు నమోదు చేసుకోవాలని తెలిపారు. 2017 సెప్టెంబర్ 1 నుంచి 2018 ఆగస్టు 31 మధ్య జన్మించిన విద్యార్థులు అర్హులని పేర్కొన్నారు. మండలంలోని విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.





## ప్రేమ పేరుతో టోకరా

**- యువకుడి నుంచి రూ.20 లక్షలు వసూలు చేసిన కిలాడీ మహిళ**

ప్రభాతగమనం, భూపాలపల్లి: మ్యాట్రిమోనీలో ఏర్పడిన పరిచయం కాస్తా ప్రేమగా మారి, చివరకు ఒక యువకుడిని నిండా ముంచిన ఘటన జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో వెలుగుచూసింది. పెళ్లి చేసుకుంటానని నమ్మించి సదరు మహిళ యువకుడి నుండి లక్షలాది రూపాయలు కాజేసింది. వర్ధన్నపేటకు చెందిన ఒక యువకుడికి, భూపాలపల్లికి చెందిన మహిళతో ఒక మ్యాట్రిమోనీ సైట్ ద్వారా పరిచయం ఏర్పడింది. ఈ పరిచయం కాస్తా ప్రేమకు దారితీయడంతో, వారిద్దరూ గత కొంతకాలంగా సన్నిహితంగా ఉంటున్నారు. తననే పెళ్లి చేసుకుంటానని నమ్మబలికిన సదరు మహిళ, వివిధ కారణాలు చెబుతూ సదరు యువకుడి వద్ద నుండి విడతల వారీగా సుమారు రూ.20 లక్షలు వసూలు చేసింది. డబ్బు తీసుకున్న తర్వాత పెళ్లి విషయం ఎత్తకుండా సదరు మహిళ తప్పించుకు తిరుగుతుండటంతో, తాను మోసపోయానని గ్రహించిన బాధితుడు చివరకు పోలీసులను ఆశ్రయించాడు. బుధవారం ఈ విషయమై సదరు యువకుడు భూపాలపల్లి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు ప్రారంభించారు.





## పెండింగ్ ఫైళ్లను త్వరగా క్లియర్ చేయాలి

**మున్సిపల్ కార్యాలయంలో ఆకస్మిక తనిఖీలు చేసిన జిల్లా కలెక్టర్**

ప్రభాత గమనం, మహబూబాబాద్, మార్చి 11: మహబూబాబాద్ పట్టణంలోని నగరపాలక సంస్థ కార్యాలయంలో జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ బుధవారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ప్రభుత్వం చేపట్టిన 99 రోజుల ప్రజాపాలన–ప్రగతి ప్రణాళిక కార్యక్రమం అమలుపై సమీక్షించారు. ఈ సందర్భంగా కార్యాలయంలో పెండింగ్‌లో ఉన్న ఫైళ్లను త్వరితగతిన క్లియర్ చేయాలని, అవసరం లేని స్క్రాప్‌ను తొలగించాలని అధికారులకు సూచించారు. దరఖాస్తులు చేసిన లబ్ధిదారుల వివరాలను ఆన్లైన్‌లో నమోదు చేసి వారి సమస్యలను పరిశీలించి పరిష్కరించాలని తెలిపారు. మున్సిపల్ పరిధిలో అభివృద్ధి పనులను వేగంగా పూర్తి చేయడంతో పాటు కాలనీల్లో విద్యుత్, తాగునీటి సరఫరాలో అంతరాయం లేకుండా చూడాలని, సానిటేషన్ పనులను షెడ్యూల్ ప్రకారం నిర్వహించాలని ఆదేశించారు. ఈ తనిఖీలో మున్సిపల్ చైర్‌పర్సన్ గుగులోతు జ్యోతి, మున్సిపల్ కమిషనర్ రాజేశ్వర్, తహసిల్దార్ రాజేశ్వరరావు తదితర అధికారులు పాల్గొన్నారు.

## విద్యార్థులు వంద శాతం ఉత్తీర్ణత సాధించాలి

ప్రభాత గమనం, మహబూబాబాద్, మార్చి 11: విద్యార్థులు చదువులో వంద శాతం ఉత్తీర్ణత సాధించడంతో పాటు మనోవికాసాన్ని కూడా పెంపొందించుకోవాలని మండల ప్రత్యేక అధికారి జినుగు మరియన్న సూచించారు. బుధవారం జిల్లా అధికారుల ఆదేశాల మేరకు నెల్లికుదురు మండలంలోని ఎస్సీ బాలుర వసతి గృహాన్ని ఆయన సందర్శించి విద్యా, వసతి, భోజన సదుపాయాలను పరిశీలించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో మాట్లాడి ఆత్మవిశ్వాసంతో చదువులో ముందుకు సాగాలని ప్రోత్సహించారు. అదేవిధంగా మానసిక ఆరోగ్యం, క్రీడలు, వ్యాయామం వంటి అంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించాలని సూచించారు. వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాల పరిశుభ్రతను కూడా సిబ్బంది, విద్యార్థులు పాటించాలని తెలిపారు. కార్యక్రమంలో వసతి గృహాల సంక్షేమ అధికారి ఎల్. సతీష్ తదితరులు పాల్గొన్నారు.

## మరిపెడలో గంజాయి ముఠా గుట్టురట్టు

ప్రభాతగమనం, మరిపెడ, మార్చి 11:మరిపెడ మున్సిపాలిటీ కేంద్రంలో అక్రమంగా గంజాయి విక్రయానికి యత్నిస్తున్న ముఠాను పోలీసులు పట్టుకున్నారు. విశాఖపట్నం జిల్లా అరకు ప్రాంతం నుంచి గంజాయిని తీసుకువచ్చి మరిపెడ రాజీవ్ గాంధీ సెంటర్ సమీపంలో విక్రయిస్తున్నారని సమాచారం అందడంతో ఎస్ఐ టి. కోటేశ్వరరావు సిబ్బందితో కలిసి దాడులు నిర్వహించారు. ఈ సందర్భంగా నలుగురు యువకులు, ఒక మైనర్‌ను అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి గంజాయి మరియు రవాణాకు ఉపయోగించిన ఎన్ఎస్ 160 బైక్‌ను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. నిందితులను సి.ఐ రాజ్‌కుమార్ గౌడ్ విచారించి కోర్టులో హాజరుపరిచి రిమాండ్‌కు తరలించినట్లు పోలీసులు తెలిపారు.

ప్రభాత గమనం
తెలుగు దినపత్రిక

# రూ.5 కోట్లకు టోకరా

**- చిట్టీలు, అధిక వడ్డీ ముసుగులో భారీ మోసం**

**- రూ.8.12 కోట్ల విలువైన ఆస్తులు స్వాధీనం**

ప్రభాత గమనం, శాయంపేట: చిట్టీలు, అధిక వడ్డీ పేరుతో అమాయక ప్రజలను మోసం చేసి రూ.కోట్లలో వసూలు చేసిన వ్యక్తిని హన్మకొండ జిల్లా శాయంపేట పోలీసులు అరెస్ట్ చేశారు. పరకాల ఏసీపీ సీ.సతీష్ బాబు తెలిపిన వివరాల ప్రకారం.. శాయంపేట మండలం పత్తిపాక గ్రామానికి చెందిన పెరుమాండ్ల కిషోర్ ప్రభుత్వ అనుమతి లేకుండా 'పెరుమాండ్ల చిట్' పేరుతో చిట్టీలు నిర్వహిస్తున్నాడు. 117 మంది నుంచి రూ.1.49 కోట్లు, అలాగే అధిక వడ్డీ ఆశ చూపుతూ మరో 59 మంది వద్ద నుంచి రూ.3.55 కోట్లు తీసుకున్నాడు. మొత్తం 176 మందిని మోసం చేశాడు. బాధితుల ఫిర్యాదుల మేరకు శాయంపేట పోలీస్ స్టేషన్‌లో కేసులు నమోదు చేసి నిందితుడిని అరెస్ట్ చేశారు. మోసం చేసిన డబ్బుతో నిందితుడు కొనుగోలు చేసిన హనుమకొండ గోపాలపూర్‌లోని ఇల్లు, వివిధ ప్రాంతాల్లోని 12 ప్లాట్లు, వ్యవసాయ భూములకు సంబంధించిన



పాస్‌బుక్‌లు, బంగారు, వెండి ఆభరణాలు, రూ.25.39 లక్షల నగదు, కారు సహా సుమారు రూ.8.12 కోట్ల విలువైన ఆస్తులను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.



# మున్నేరు వాగుపై ప్రాజెక్టు నిర్మించాలి

**గిరిజన సంఘం జిల్లా కార్యదర్శి భూక్య హరినాయక్**

ప్రభాత గమనం, గార్ల, మార్చి 11: మున్నేరు వాగుపై ప్రాజెక్టు నిర్మించి గార్ల మండల రైతులను ఆదుకోవాలని గిరిజన సంఘం జిల్లా కార్యదర్శి భూక్య హరినాయక్ కోరారు. బుధవారం కోటి యానాయక్ తండాలో నిర్వహించిన గ్రామసభలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గార్ల మండలంలో రైతులు సాగునీటి సమస్యతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. మున్నేరు వాగుపై ప్రాజెక్టు నిర్మాణం చేపడితే గార్ల మండలంలోని పలు గ్రామాలకు సాగునీరు అందడంతో రైతులకు ఎంతో మేలు జరుగుతుందని తెలిపారు. గార్ల మండలాన్ని ఎడారిగా మార్చే జీఓ 98ను రద్దు చేసి, జీఓ 1076ను అమలు చేస్తూ మున్నేరు వాగుపై ప్రాజెక్టు నిర్మాణానికి ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని గ్రామసభలో తీర్మానం చేయాలని సూచించారు. అదేవిధంగా కోటియానాయక్ తండా పరిధిలో అభివృద్ధి పనులు చేపట్టాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. ముత్తితండ సెంటర్ నుంచి వీధి లైట్లు ఏర్పాటు చేయడం, సైడ్ డ్రైనేజీలు నిర్మించడం వంటి పనులను గ్రామసభలో తీర్మానించి అమలు చేయాలని కోరారు. అనంతరం కోటి యానాయక్ తండా సర్పంచ్, పంచాయతీ కార్యదర్శికి సమస్యలపై వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో రనువల్ వీరన్న, ఆర్.రాజేష్, బి.విటల్, రైతులు, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.



# మహిళలు ఆర్థిక ప్రగతి సాధించాలి

**–జిల్లా అదనపు కలెక్టర్ లెనిన్ వత్సల్ టోప్పో**

ప్రభాత గమనం, మహబూబాబాద్, మార్చి 11: మహిళలు అన్ని రంగాల్లో ముందంజలో ఉండి ఆర్థిక ప్రగతి సాధించాలని జిల్లా అదనపు కలెక్టర్ లెనిన్ వత్సల్ టోప్పో అన్నారు. బుధవారం జిల్లా సమీకృత కలెక్టర్ కార్యాలయంలో మహిళలు, పిల్లలు, దివ్యాంగులు, వయోవృద్ధుల శాఖ ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి అదనపు కలెక్టర్లు లెనిన్ వత్సల్ టోప్పో, కె. అనిల్ కుమార్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా లెనిన్ వత్సల్ టోప్పో మాట్లాడుతూ మహిళల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను సమర్థంగా అమలు చేయడానికి జిల్లా యంత్రాంగం కట్టుబడి పనిచేస్తోందన్నారు. స్వయం సహాయక సంఘాల ద్వారా మహిళలకు ఆర్థిక బలం కల్పిస్తూ, నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలతో ప్రోత్సహిస్తున్నామని తెలిపారు. ప్రతి ఇంటికి సురక్షిత తాగునీరు అందించడం, తల్లులు–శిశువుల ఆరోగ్య సంరక్షణను మెరుగుపరచడం వంటి చర్యలు కొనసాగుతున్నాయని పేర్కొన్నారు. నిజమైన మహిళా సాధికారత ఇంటి నుంచే ప్రారంభమవుతుందని, బాలికలను విద్య, నాయకత్వం, పోటీలలో ముందుకు తీసుకురావడం అవసరమని అన్నారు. మహిళల భద్రత సమాజంలోని ప్రతి ఒక్కరి బాధ్యత అని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో టీఎన్జీవో అధ్యక్షులు శ్రీనివాస్, డీపీఆర్ఓ రాజేంద్రప్రసాద్, ఎంప్లాయిమెంట్ ఆఫీసర్ రజిత, ఐసీడీఎస్ సీడీపీఓలు, సూపర్వైజర్లు, జిల్లా మహిళా సాధికారత కేంద్రం సిబ్బంది, సఖి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థులు కష్టపడి చదవాలి

**–కౌన్సిలర్ రావుల నవీన్ రెడ్డి**




ప్రభాత గమనం, కేసముద్రం, మార్చి 11: విద్యార్థులు కష్టపడి చదువుకుని ఉపాధ్యాయులు, తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలని ఏడవ వార్డ్ కౌన్సిలర్ రావుల నవీన్ రెడ్డి అన్నారు. బుధవారం కేసముద్రం విలేజ్ హైస్కూల్లో నిర్వహించిన పదవ తరగతి వీడ్కోలు కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పాఠశాల జీవితంలో నేర్చుకున్న విలువలు, క్రమశిక్షణను జీవితంలో పాటిస్తూ విద్యార్థులు తమ లక్ష్యాలను సాధించాలని సూచించారు. పాఠశాల జ్ఞాపకాలు ఎప్పటికీ మధురంగా నిలిచిపోతాయని, విద్యార్థులు ఎంచుకున్న రంగంలో ఉన్నత స్థానాలను సాధించాలని ఆకాంక్షించారు. కష్టపడి పనిచేస్తేనే కలలు నిజమవుతాయని తెలిపారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు రాజశేఖర్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



# దళిత హక్కుల పోరాట సమితి 2వ రాష్ట్ర మహాసభల పోస్టర్ ఆవిష్కరణ

ప్రభాత గమనం, వరంగల్ బ్యూరో, మార్చి 11: దళిత హక్కుల పరిరక్షణ, రాజ్యాంగ విలువల సాధన లక్ష్యాలతో పనిచేస్తున్న దళిత హక్కుల పోరాట సమితి (డీహెచ్‌పీఎస్) నిర్వహించనున్న 2వ రాష్ట్ర మహాసభల పోస్టర్‌ను సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు బుధవారం ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నాయకులు తక్కలపల్లి శ్రీనివాసరావు, ఈటి నరసింహ, కలవేనని శంకర్, ఎం. బాల్ నరసింహ, వరంగల్ జిల్లా కార్యదర్శి షేక్ భాష్మియా, సీనియర్ నాయకులు మేకల రవి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు మాట్లాడుతూ దేశంలో దళితులపై జరుగుతున్న వివక్ష, హింస పూర్తిగా తగ్గలేదని అన్నారు. రాజ్యాంగం కల్పించిన హక్కులను అమలు చేయడంలో ప్రభుత్వాలు విఫలమవుతున్నాయని విమర్శించారు. దళితులకు విద్య, ఉపాధి, భూమి, సామాజిక భద్రత రంగాల్లో సముచిత అవకాశాలు కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. దళితుల సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లడంలో డీహెచ్‌పీఎస్ కీలక పాత్ర పోషిస్తోందని పేర్కొన్నారు. ఈ మహాసభలు ఏప్రిల్ 17, 18 తేదీలలో వరంగల్ నగరంలో నిర్వహించనున్నట్లు తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా దళితులు, ప్రజాసంఘాలు, ప్రజాస్వామ్య శక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని మహాసభలను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో డీహెచ్‌పీఎస్ రాష్ట్ర అధ్యక్షులు కే. ఏసురత్నం, ప్రధాన కార్యదర్శి మారుపాక అనిల్ కుమార్, రాష్ట్ర నాయకులు ఆరుట్ల రాజ్‌కుమార్, జేరుపోతుల కుమార్, కే. వెంకటస్వామి, టీ. రామకృష్ణ, వై. ఉషశ్రీ, సంఘీ ఎలేందర్, యకంబరచారి రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.

Published and Owned by Pitta Sreekanth at .H NO 1-7-883/6/101 VIVEKANANDA COLONY HUNTER ROAD HANUMAKONDA,
WARANGAL URBAN, TELANGANA, 506001 Editor. P. Ravichandra